క్లుప్తంగా

నీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలి


అధికారులతో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్ పర్సన్ మాబున్నిసా

నంద్యాల(సిటీ): పట్టణంలో నీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలని మున్సిపల్ చైర్ పర్సన్ షేక్ మాబున్నిసా తెలిపారు. శుక్రవారం మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డితో పట్టణంలో నీటిఎద్దడి ఉన్న బొగ్గులైన్, సాయిబాబ నగర్, నూనెపల్లె ప్రాంతాల్లో పర్యటించారు. అనంతరం ఆయా ప్రాంతాలకుట్యాంకులతో తాగునీరు అందించాలని అధికారులను ఆదేశించారు. పట్టణంలో ఎక్కడా నీటి కొరత రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పైపులైన్ నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసి ప్రతి గృహానికి నీరు అందించాలని చెప్పారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని ప్రత్యామ్నాయ మార్గాలను సిద్ధం చేసుకోవాలన్నారు. నాయకులు అనిల్ అమృతరాజ్, మున్సిపల్ ఇంజినీర్ రమణమూర్తి, డీఈఈ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

మందులు సక్రమంగా అందజేయండి


రికార్డులను పరిశీలిస్తున్న డాక్టర్ మల్లికార్జునరెడ్డి

గోస్పాడు: టీబీ, లెప్రసీ వ్యాధిగ్రస్తులకు మందులు సక్రమంగా అందేలా చూడాలని అసిస్టెంట్ జిల్లా అధికారి డాక్టర్ మల్లికార్జున్ రెడ్డి సూచించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఆరోగ్య సమస్యలతో బాధపడుతూ వచ్చే వారికి అన్ని రకాల పరీక్షలను నిర్వహించి రోగ నిర్ధారణ చేయాలన్నారు. టీబీ,లెప్రసి, ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు మందులు సకాలంలో వారి ఇళ్ల వద్దకు వెళ్లి అందజేయాలన్నారు. వారికి మందులతో పాటు నెలకు రూ.500 ఇస్తుందని, ఆ సొమ్ము వారి ఖాతాల్లోకి జమ చేస్తుందని చెప్పారు. అనంతరము సిబ్బంది హాజరు రికార్డులు, ల్యాబ్‌ను పరిశీలించారు. డాక్టర్ గోపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ప్రింటర్స్ డే


గాంధీజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం) : ప్రింటర్స్ డే సందర్భంగా నంద్యాల ప్రింటింగ్ ప్రెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ముందుగా స్థానిక కాళికాంబ దేవస్థానంలో సమావేశం నిర్వహించారు. అనంతరం ర్యాలీగా గాంధీ చౌక్, బైర్మల్ వీధి గుండా గాంధీ చౌక్ చేరుకొని అక్కడ గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సంఘం నాయకులు రామకృష్ణప్రసాద్, కృష్ణమూర్తి, చంద్రమౌళీశ్వరరెడ్డి, వెంకటేశ్వర్లు, ఓబులేష్, గోపాల్‌రెడ్డి, రమణ, జమాల్, మద్దిలేటి, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

చదువుల రామయ్యను ఆదర్శంగా తీసుకోవాలి


నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

నంద్యాల(అర్బన్): పోరాట యోధుడు ఉమ్మడి కర్నూలు జిల్లా సీపీఐ కార్యదర్శి కామ్రేడ్ చదువుల రామయ్యను యువత ఆదర్శంగా తీసుకోవాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్ పిలుపునిచ్చారు. చదువుల రామయ్య 31వ వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక సీపీఐ కార్యాలయంలో నాయకులు రామయ్య చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ ధనిక రైతు కుటుంబంలో పుట్టి కమ్యూనిస్టు ఉద్యమాలకు ఆకర్షితులై పెత్తందారుల దౌర్జన్యాలకు ఎదురొడ్డి నిలిచారని కొనియాడారు. పట్టణ కార్యదర్శి ప్రసాద్, సోమన్న, సుబ్బరాయుడు, ధనుంజయుడు, సురేష్ పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ పాటించాలి

ఉయ్యాలవాడ : ఎమ్మెల్సీ ఎన్నికల నియమావళి అమల్లో ఉందని మండలంలో ప్రతి ఒక్కరూ నిబంధనల మేరకే నడుచుకోవాలని తహసీల్దార్ రవికుమార్ సూచించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎలాంటి వాల్‌పోస్టర్లు, గృహ యజమానుల అనుమతి లేకుండా అతికించరాదని, అలా అతికిస్తే ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. వీఆర్‌ఓలను నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించామన్నారు. అభ్యర్థులు, పార్టీల నాయకుల ప్రచారానికి నిబంధనల మేరకే అనుమతిస్తామని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ వెంకటస్వామి ఉన్నారు.

అతివలకు ఆర్థిక అక్షరాస్యత

పొదుపు సంఘాల్లో అవినీతిని అరికట్టేందుకు, సభ్యులు రుణాలు చెల్లించడం, తీసుకోవడం, బ్యాంకుల్లో లావాదేవీల నిర్వహణ, ఖాతాలో నిల్వ గురించి తెలుసుకోవడం, పుస్తకాల్లో వివరాల నమోదుపై అవగాహన పెంచుకునేలా ప్రభుత్వం మహిళలకు శిక్షణ ఇస్తోంది. ఎంపిక చేసిన బృందాలకు ఆయా అంశాలతో పాటు ఆన్‌లైన్ మోసాలు, స్మార్ట్ ఫోన్ వినియోగం గురించి, ఆర్థిక అక్షరాస్యతపై వర్చువల్‌గా వివరిస్తున్నారు.

- పొదుపు మహిళలకు వర్చువల్ విధానంలో శిక్షణ
- బ్యాంకుల లావాదేవీలు, రుణాల చెల్లింపులపై అవగాహన
- సంఘాల్లో అవినీతికి చెక్
- ఆర్థిక మోసాలపై అప్రమత్తంగా ఉండేలా బోధన


పొదుపు మహిళలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

నంద్యాల: గ్రామీణ ప్రాంతాల్లో డ్వాక్రా సంఘాల్లో సభ్యులుగా ఉన్న మహిళలకు ఆర్థిక అక్షరాస్యతపై వర్చువల్ విధానంలో శిక్షణ ఇస్తున్నారు. ఎంపిక చేసిన బృందాల సభ్యులకు ఉదయం, సాయంత్రం వేళల్లో ఒక చోట సమావేశ పరుస్తున్నారు. బ్యాంకు లావాదేవీలు, రుణాలు పొందే సమయంలో మోసాలకు తావు లేకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వారికి సంబంధిత బ్యాంకుల ఆధ్వర్యంలో అవగాహన కల్పిస్తున్నారు. బ్యాంకులో నగదు తీసుకోవడం, జమ చేయడం, పొందుపు ఖాతాల్లో ఎంత సొమ్ము ఉందో ఆరా తీయడం, రుణ వాయిదాలను ప్రతి నెల చెల్లిస్తున్నారో లేదో తెలుసుకోవడం, బ్యాంకు పుస్తకాల్లో నమోదు వివరాలు తదితర అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు.

రుణాలు పొందేలా..

గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు తమ వ్యాపార, ఇతర అవసరాలకు ప్రైవేటు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి అధిక వడ్డీలతో మోసపోకుండా ఉండటం, వారికి అవసరమైన మొత్తం బ్యాంకుల నుంచే రుణాలు పొందడం, పొదుపు పథకాలు, తదితర వాటిపై అవగాహన కల్పించడం కార్యక్రమ ముఖ్య ఉద్దేశం, గ్రామాల వారీగా డ్వాక్రా సంఘాల్లో సభ్యులుగా గ్రామీణ మహిళలకు ఆయా వీఓఏలు గ్రామంలో ఒకచోట సమావేశం ఏర్పాటు చేసి వర్చువల్ విధానంలో ఆర్థిక లావాదేవీలపై శిక్షణ ఇస్తున్నారు.

బహుళ ప్రయోజనం..

ఆర్థిక లావాదేవీలపై గ్రామీణ మహిళలకు పూర్తిస్థాయి అవగాహన ఏర్పడటంతో పాటు డ్వాక్రా సంఘాల్లో తిష్ట వేసిన అవినీతికి అడ్డుకట్ట వేయవచ్చు. ఇప్పటి వరకు సంఘాల్లో సభ్యులుగా ఉన్న మహిళలకు తెలియకుండానే వారి పేరు మీద సిబ్బంది రుణాలు తీసుకొని వాటిని ఎగ్గొట్టిన ఉదంతాలు అనేకం ఉన్నాయి. సంఘాల్లో ఉన్న సభ్యులకు బ్యాంకింగ్ వ్యవస్థపై పూర్తిస్థాయి అవగాహన లేకపోవడంతో సిబ్బంది మోసాలకు పాల్పడుతున్నారు. దీంతో సభ్యులు నష్టపోతున్నారు. ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించడంతో ఆర్థిక మోసాలపై మహిళలు అప్రమత్తంగా ఉండటానికి ఉపయోగపడుతుంది.

జిల్లాలోని స్వయం సహాయక సంఘాలు, సభ్యులు..

నియోజకవర్గం	పొదుపు సంఘాలు	సభ్యులు
ఆళ్లగడ్డ	5,539	58,387
బనగానపల్లె	6,719	69,517
నందికొట్కూరు	5,672	59,720
నంద్యాల	2,605	27,945
పాణ్యం	2,135	23,421
శ్రీశైలం	4,817	51,022
డోన్	4,927	52,358
మొత్తం	32,414	3,42,370

శిక్షణతో అనేక ఉపయోగాలు



స్వయం సహాయక సంఘాల్లో నగదు, జమ, పొదుపు లావాదేవీలపై సభ్యులంతా అవగాహన కలిగి ఉండాలి. ప్రతి నెల సమావేశాల్లో వీటిని చర్చించి సూచనలు ఇస్తే ప్రతి గ్రూపు ముందంజలో ఉంటుంది. సభ్యులకు శిక్షణ ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. లావాదేవీలపై అవగాహన కలిగి గ్రూపులు కొనసాగేలా సభ్యులు సహకరించుకోవాలి.

– శ్రీధర్‌రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ, నంద్యాల

ట్రాక్టర్ మంజూరు

శిరివెళ్ల: వైఎస్సార్ యంత్ర సేవా కింద రైతులకు ట్రాక్టర్లను మంజూరు చేస్తున్నట్లు కేడీసీసీ బ్రాంచ్ చీఫ్ మేనేజర్ మహబూబ్‌బాషా శుక్రవారం తెలిపారు. గోస్పాడు మండలం ఎం.కృష్ణాపురం గ్రామానికి చెందిన వెంకటేశ్వర రైతు మిత్ర సంఘానికి తాజాగా ట్రాక్టర్ మంజూరు చేశామని చెప్పారు. ట్రాక్టర్‌కు బ్యాంక్ రూ.4 లక్షలు రుణం, సంఘం వాటా రూ. 80 వేలు ఉంటుందన్నారు. ప్రభుత్వం ట్రాక్టర్‌పై రూ.3 లక్షలు సబ్సిడీ ఇస్తుందని పేర్కొన్నారు. ప్రతి రైతు భరోసా కేంద్రం పరిధిలో రైతు మిత్ర సంఘం రూ.12 లక్షలు విలువజేసే వ్యవసాయ యంత్ర పరికరాలను కొనుగోలు చేయవచ్చని తెలిపారు.

26న ఉచిత వైద్య శిబిరం

నంద్యాల(వ్యవసాయం): ఈనెల 26వ తేదీన నెరవాటి వైద్యశాల ఆధ్వర్యంలో సంతానం లేని దంపతులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు నెరవాటి సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం స్థానిక ఆసుపత్రిలో కరపత్రాలు విడుదల చేశారు. పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సద్వినియోగం చేసుకోండి

గోస్పాడు: ఆర్బీకేల్లో ఏర్పాటు చేసిన జొన్న కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ అధికారి అబ్దుల్ హక్ తెలిపారు. శుక్రవారం స్థానిక రైతు భరోసా కేంద్రంలో ఆయన మాట్లాడుతూ రైతులు ఈ-కేవైసీ చేయించుకుని పంట కొనుగోలుకు పేరు నమోదు చేసుకోవాలని చెప్పారు. పీఎం కిసాన్ తదుపరి విడత సొమ్ము జమ కావాలంటే తప్పనిసరిగా ఈ-కేవైసీ చేయించుకోవాలన్నారు. జొన్నలను విక్రయించే రైతులకు గోనె సంచులు ఉచితంగా అందించడంతో పాటు రవాణా చార్జీలు కూడా పౌరసరఫరాల శాఖ ఇస్తుందని చెప్పారు.

రైతులు అభ్యంతరాలు తెలపాలి


సమావేశంలో మాట్లాడుతున్న జేసీ టి.నిశాంతి

నంద్యాల(అర్బన్): నంద్యాల నుంచి జమ్మలమడుగు వరకు ఏర్పాటయ్యే 167–కే జాతీయ రహదారికి సేకరించే భూములకు సంబంధించిన రైతుల అభ్యంతరాలు ఉంటే తెలపాలని జాయింట్ కలెక్టర్ టీ.నిశాంతి తెలిపారు. స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం జాతీయ రహదారికి సంబంధించిన అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ నంద్యాల నుంచి జమ్మల మడుగు జాతీయ (రెండు వరసల) రహదారి నిర్మాణంలో.. నూనెపల్లె, కానాలతో పాటు గోస్పాడు మండలంలోని చింతకుంట్ల, జూలెపల్లె, పసురపాడు, గోస్పాడు, ఒంటివెలగల గ్రామాలు, దొర్నిపాడు మండలంలోని గుండుపాపల, కోవెలకుంట్ల మండలంలోని రేవనూరు, ఉప్పలూరు, కలుగొట్ల, జొళదరాశి, చింతకుంట, కోవెలకుంట్ల, పొట్టిపాడు, గుళ్లదుర్తి, ఉయ్యాలవాడ మండలంలోని నర్సిపల్లి, అల్లూరు, మాయలూరు, రూపనగుడి, బోడెమ్మనూరు, సంజామల మండలంలోని నొస్సం గ్రామాల మీదుగా 363.71 ఎకరాలు పోతున్నాయన్నారు. భూసేకరణలో పోతున్న భూముల యజమానులకు ఏవైనా అభ్యంతరాలు ఉంటే ప్రచురణ ఈనెల 21వ తేదీ నుంచి 21రోజుల వ్యవధిలో రాత పూర్వకంగా తెలుపుకోవచ్చని చెప్పారు. రహదారి వెళ్లే గ్రామాల్లో సంబంధిత కన్సల్టెన్సీ వారు మార్చి 1 నుంచి నెలాఖరులోపు జాతీయ రహదారి వెళ్లే మార్గాన్ని ఖరారు చేస్తారని స్పష్టం చేశారు.

కుష్టు ముదిరితే అంగవైకల్యం

నంద్యాల(అర్బన్): కుష్టు వ్యాధి ముదిరి నరాలకు సోకడం వల్ల అంగవైకల్యం ఏర్పడుతుందని జిల్లా కుష్టు, ఎయిడ్స్, టీబీ అధికారి డాక్టర్ బాలాజీ తెలిపారు. వ్యాధి సోకిన వారు ప్రాథమిక దశలోనే మందులు వాడితే తగ్గుతుందన్నారు. స్థానిక హరిజనవాడ అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం కుష్టువ్యాధితో అంగవైకల్యం ఏర్పడిన రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వ్యాధి సోకిన వారు సకాలంలో మందులు తీసుకోకపోవడం వల్ల వ్యాధి ముదిరి నరాలకు సోకుతుందన్నారు. అంగవైకల్యం ఏర్పడిన వారికి నెల్లూరు జిల్లాలోని డీఎఫ్ఐటీ (డెమెన్ ఫౌండేషన్ ఇండియన్ ట్రస్ట్)లో రీ కన్‌స్ట్రక్షన్ సర్జరీ చేస్తున్నామని, అందుకోసం నిర్వహించే స్క్రీనింగ్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సభ, సిబ్బంది పాల్గొన్నారు.


రోగిని పరిశీలిస్తున్న వైద్యులు

బీసీలకు పదవుల్లో అగ్రస్థానం

– జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

కొలిమిగుండ్ల: ఏరాష్ట్రంలో లేని విధంగా బీసీలకు పదవుల్లో అగ్రస్థానం కల్పించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి కొనియాడారు. శుక్రవారం సాయంత్రం కొలిమిగుండ్లలోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇటీవల ప్రకటించిన 18 ఎమ్మెల్సీ స్థానాలకు ఎక్కువ భాగం బీసీలకు ప్రాధాన్యత కల్పించడంపై జెడ్పీ చైర్మన్ హర్షం వ్యక్తం చేశారు. శాసన మండలిలో వైఎస్‌ఆర్‌సీపీ బలం 44కు చేరిందన్నారు. ఇందులో బీసీలు 19 మంది ఉన్నారన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎమ్మెల్సీ స్థానాల్లో బీసీలకు అగ్రతాంబూలం కేటాయించడంతో రాష్ట్రంలో విస్తృతంగా చర్చ మొదలైందని, చర్చను పక్కదారి పట్టించేందుకు టీడీపీ నాయకులు అలజడులకు పాల్పడ్డారని ఆరోపించారు. కార్యక్రమంలో జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు లాయర్ మహేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబటి గుర్విరెడ్డి, జిల్లా ప్రచార కార్యదర్శి పేరం సత్యనారాయణరెడ్డి, వైస్ ఎంపీపీ క్రిష్ణారెడ్డి, కోవెలకుంట్ల మార్కెట్ యార్డు ఉపాధ్యక్షుడు రామసుబ్బయ్య, నాయకులు టీసీ వెంకట్రాముడు, సుబ్బారెడ్డి, కామిని తిమ్మారెడ్డి, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

కర్నూలు కల్చరల్: ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత కలుగుతుందని అష్టాక్షరీ సంపత్కుమార రామానుజ జీయర్ స్వామి పేర్కొన్నారు. కర్నూలు నగర శివారులోని మామిదాలపాడు సమీపంలోని గోదా గోకులంలో నిర్వహించనున్న శ్రీరంగనాయకి గోదా సమేత శ్రీరంగనాథ పెరుమాళ్, సుదర్శన, గరుడ, ఆల్వారాచార్యుల దేవతామూర్తుల ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని పురస్కరించుకొని శుక్రవారం లక్ష్మీనారాయణ ఇష్టి కార్యక్రమం అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. యాగశాల ద్వారతోరణ ధ్వజ, కుంభాభిషేకం, బాలభోగ నివేదన, విష్ణు సహస్రనామ పారాయణం తదితర కార్యక్రమాలు జరిగాయి. రామానుజ జీయర్ స్వామి అనుగ్రహ భాషణం చేశారు. వేద పండితుల ఆధ్వర్యంలో జరుగుతున్న విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివార్లను దర్శించుకున్నారు. గోదాగోకులం వ్యవస్థాపకులు మారం నాగరాజు గుప్త, మేనేజింగ్ ట్రస్టీ పల్లెర్ల నాగరాజు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

కొలిమిగుండ్ల: బాల్యవివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని ఎస్‌బీసీసీ జిల్లా కో–ఆర్డినేటర్ విజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం కొలిమిగుండ్లలోని కస్తూర్బా పాఠశాలలో బాల్యవివాహాలపై విద్యార్థినులకు ఆయన అవగాహన కల్పించారు. బాల్య వివాహాల మూలంగా బాలికలు ఎన్నో అనర్థాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. మాతాశిశు మరణాలు ఎక్కువగా ఉంటాయని, తక్కువ బరువుతో పిల్లలు పుట్టడం, మానసిక, శారీరక వికలాంగత్వ సంతానం పుడుతారని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం బాల్య వివాహాల కట్టడికి కల్యాణ మస్తు, షాదితోఫా పథకాలను అమలు చేస్తుందన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి


మృతిచెందిన సుబ్బరాయుడు

బొమ్మలసత్రం: నంద్యాల పట్టణంలో కర్నూలు–నంద్యాల బైపాస్ రోడ్డులోని కుందూ నది బ్రిడ్జి సమీపంలో శుక్రవారం వేకువజామున సుబ్బరాయుడు (45) అనుమానాస్పదంగా మృతి చెందాడు. త్రీటౌన్ సీఐ నరసింహులు తెలిపిన వివరాల మేరకు.. ఆళ్లగడ్డ మండలం ఎం.కృష్ణాపురం గ్రామానికి చెందిన సుబ్బరాయుడు గ్రామంలో ఖాళీగా తిరిగేవాడు. గురువారం ఇంట్లో చెప్పకుండా నంద్యాలకు వచ్చాడు. వేకువజామున బ్రిడ్జి సమీపంలో మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. సుబ్బరాయుడు చెవి, ముక్కు నుంచి తీవ్ర రక్తస్రావమైనట్లు గుర్తించామని ఏదైనా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడమే మృతికి కారణమై ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని సీఐ పేర్కొన్నారు.

మోటార్ సైకిళ్లు ఢీ.. ఇద్దరికి గాయాలు

క్రైం కార్నర్

రుద్రవరం: మండలంలోని బీ.నాగిరెడ్డిపల్లె, చిన్నకంబలూరు మెట్ట మధ్య శుక్రవారం రెండు మోటార్ సైకిళ్లు ఎదురెదురుగా ఢీ కొన్న ఘటనలో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. సీతారామాపురం గ్రామానికి చెందిన రామచంద్రుడు,పుల్లయ్య మోటార్ సైకిల్‌పై నాగిరెడ్డిపల్లె నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా అదే సమయంలో చిన్నకంబలూరు నుంచి శ్రీనివాసులు,రాముడు మరో మోటార్ సైకిల్‌పై రుద్రవరం వైపు వస్తుండగా ప్రమాద వశాత్తు ఢీ కొన్నాయి. ప్రమాదంలో సీతారామాపురానికి చెందిన ఇద్దరు గాయ పడగా అటు వైపు వెళ్తున్న వారు క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108 వాహనం ద్వారా నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

గడ్డివాములు దగ్ధం


తగలబడుతున్న గడ్డివాములు

ఆళ్లగడ్డ: చాగలమర్రి మండలం తోడేండ్లపల్లిలో జరిగిన అగ్నిప్రమాదంలో శుక్రవారం ఐదు గడ్డి వాములు దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన శ్రీనివాసరెడ్డి, యల్లయ్య, శ్రీనివాసులుకు చెందిన గడ్డి వాముల్లో ప్రమాదవశాత్తు మంటలు చెలరేగడంతో గ్రామస్తులు గమనించి అదుపు చేసేందుకు ప్రయత్నించినప్పటికీ అదుపులోకి రాలేదు. దీంతో గడ్డి వాములు కాలి బూడిదయ్యాయి. ప్రమాదంలో సుమారు రూ.5 లక్షల మేర నష్టం జరిగిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు


పూజలందుకున్న ఉత్సవమూర్తులు


తుండ్లవాగు వద్ద పల్లకీ మోస్తున్న ఎమ్మెల్యే బిజేంద్రారెడ్డి


రుద్రవరం బెస్త కాలనీలో బండలాగుతున్న ఎద్దులు

రుద్రవరం: పార్వేట ఉత్సవమూర్తులు జ్వాలానరసింహస్వామి, ప్రహ్లాదవరద స్వామి వారి పల్లకీ గురువారం రాత్రి కాలిబాటన అహోబిలం బయలుదేరింది. ఈ క్రమంలో ఆళ్లగడ్డ–అహోబిలం రహదారిలోని తుండ్లవాగు (సాయిబాబ మందిరం) వద్ద ఇస్కాన్ నిర్వాహకులు ఏర్పాటు చేసిన ప్రత్యేక మండపంలో పల్లకీని కొలువుదీర్చారు. రాత్రి అక్కడ ప్రత్యేక పూజలు, భజనలు నిర్వహించిన అనంతరం శుక్రవారం తెల్లవారుజామున అహోబిలం పయనమయ్యారు. ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి,ఆళ్లగడ్డ వ్యవసాయ మార్కెట్‌యార్డు కమిటీ చైర్మన్ గంధం రాఘవరెడ్డి అక్కడికి చేరుకొని స్వామి వార్లకు ప్రత్యేక పూజలు చేసి బోయిలతో పాటు పల్లకీ మోశారు. అలాగే పల్లకీ అహోబిలం చేరుకునే వరకు వెంట నడిచారు. కాగా స్వామి వార్ల పల్లకీ రాక సందర్భంగా మండల కేంద్రంలో పండుగ వాతావరణం నెలకొంది. బొమ్మలు, గాజులు, మిఠాయిల అంగళ్లు వెలిశాయి. వాటి వద్ద కొనుగోలుదారుల సందడి నెలకొంది. అలాగే బెస్త కాలనీ వాసులు ఎద్దుల బండలాగుడు పోటీలు ఏర్పాటు చేశారు. కర్నూలు, నంద్యాల, వైఎస్సార్ కడప జిల్లాల్లోని పలు గ్రామాల నుంచి 22 జతల ఎద్దులు పోటీల్లో పాల్గొన్నాయి. గెలుపొందిన ఎద్దుల యజమానులను వెండిని బహుమతిగా అందజేశారు.

28న శాప్ యోగా లీగ్ ఫేజ్–2 పోటీలు

నంద్యాల(సిటీ): రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు ఈ నెల 28వ తేదీన యోగా లీగ్ ఫేజ్–2 పోటీలు నిర్వహిస్తున్నట్లు క్రీడాప్రాధికార సంస్థ ముఖ్య శిక్షకుడు రాజు శుక్రవారం తెలిపారు. కర్నూలులోని డీఎస్‌ఏ అవుట్ డోర్ స్టేడియంలో నిర్వహించే రాష్ట్రస్థాయి యోగా పోటీలు సంఘం ప్రధాన కార్యదర్శి అవినాష్ శెట్టి ఆధ్వర్యంలో జరగనున్నాయన్నారు. ఈ పోటీలు అండర్ 8–10, అండర్ 12–14, అండర్ 14–17 విభాగాల్లో జరుగుతాయని చెప్పారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు శాప్ లీగ్ యాప్ ద్వారా నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 9885240365 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

కొనసాగుతున్న రిలే దీక్షలు

నంద్యాల(అర్బన్): విజయ డెయిరీలో తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలంటూ సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక కలెక్టర్ కార్యాలయం ఎదుట చేపట్టిన రిలే దీక్షలు శుక్రవారం నాలుగవ రోజుకు చేరాయి. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక జిల్లా నాయకులు రామరాజు మాట్లాడుతూ అకారణంగా తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని కోరారు. విచారణ చేయాల్సి జిల్లా లేబర్ అధికారులు పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. తిరుపతయ్య, భాస్కర్, పుల్లయ్య, మద్దిలేటి, మధు, సుబ్బయ్య, గోవిందు పాల్గొన్నారు.

మహిళల సంక్షేమంతోనే సామాజిక స్వాతంత్య్రం


మందాల రాధికను అభినందిస్తున్న ఎమ్మెల్యే గంగుల

ఆళ్లగడ్డ: మహిళల సంక్షేమంతోనే సామాజిక స్వాతంత్య్రం సాధ్యమని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నమ్మారని ఆ దిశగానే వివిధ సంక్షేమ పథకాలు మహిళల పేరుతో అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఇటీవల వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షురాలిగా ఎన్నికైన మందాల రాధిక ఎమ్మెల్యేను కలిసి సన్మానించారు. వారు మాట్లాడుతూ దేశ చరిత్రలో ఇంతవరకు ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా మహిళలకు ఏకంగా 51 శాతం పదవులు ఇచ్చిన వ్యక్తి జగనన్న అన్నారు. ఇంత మంది మహిళా ప్రతినిధులు దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేరన్నారు. శిరివెళ్ల ఎంపీపీ వసీం, నాయకులు శివారెడ్డి, సలాం, ఇందూరు ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతోనే సన్మార్గం

ఆధ్యాత్మికతతోనే మనిషి సన్మార్గంలో నడవడం సాధ్యపడుతుందని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పేర్కొన్నారు. పార్వేట ముగించుకుని ఉత్స వ పల్లకీ అహోబిలం చేరుకున్న సందర్భంగా శుక్రవారం అహోబిలంలో హరే రామ హరే కృష్ణ సంస్థ నిర్వాహకుల ఆధ్వర్యంలో స్వామిని మోసిన బోయిలకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. ప్రధానార్చకులు వేణుగోపాలన్, మార్కెట్‌యార్డ్ చైర్మన్ గంధం రాఘవరెడ్డి ఉన్నారు.

కాలినడకన అహోబిలం పయనం

రుద్రవరం: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాలు,ప్రాంతాలకు చెందిన నృసింహ మాలధారులు దీక్ష విరమణ కోసం శక్రవారం పాదయాత్రగా అహోబిలం క్షేత్రానికి బయలుదేరారు. జనవరి 16 అహోబిలంలో నరసింహస్వామి పారువేటకు బయలుదేరే రోజున వేలాది మంది భక్తులు స్వామి వారి దీక్షబూనారు. మండల దీక్ష పూర్తి కావడంతో పాటు పార్వేట ఉత్సవమూర్తులు అహోబిలం చేరుకోవడంతో మాలాధారులు దీక్ష విరమించేందుకు కాలి బాటన అహోబిలానికి తరలివెళ్లారు.


రుద్రవరం నుంచి అహోబిలానికి పాదయాత్రగా వెళ్తున్న మాలాధారులు

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి మొండిచెయ్యి


మాట్లాడుతున్న రమేష్‌కుమార్

నంద్యాల(అర్బన్): కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశ పెట్టిన బడ్జెట్‌తో రాష్ట్రానికి ప్రత్యేక కేటాయింపులు లేవని, అవినీతి పరులను అందలం ఎక్కించేలా ఉందని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌కుమార్ విమర్శించారు. బడ్జెట్‌లో రాష్ట్రానికి మొండిచెయ్యి చూపడం అన్యాయమన్నారు. బడ్జెట్ కేటాయింపులను వ్యతిరేకిస్తూ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రూ.45లక్షల కోట్ల బడ్జెట్‌లో సామాన్య ప్రజలకు ఉపయోగపడేది లేకపోవడం దుర్మార్గమన్నారు. ద్రవ్యలోటు నివారణ, ఉద్యోగిత కల్పనపై ప్రస్తావన లేకపోవడం దారుణమన్నారు. రైతులకు రుణమాఫీ, మద్దతు ధరలు బడ్జెట్‌లో కేటాయించకపోవడం అన్యాయమన్నారు. నాయకులు నరసింహులు, తోట మద్దులు, గౌస్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

రీ సర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం


పుచ్చకాయలపల్లె వద్ద గ్రాండ్ కంట్రోల్ పాయింట్స్‌ను పరిశీలిస్తున్న సర్వేయర్లు

ఉయ్యాలవాడ : భూ రీసర్వేతో రైతుల భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని మండల సర్వేయర్ విజయలక్ష్మి తెలిపారు. జగనన్న శాశ్వత భూ హక్కు భూ రక్షలో భాగంగా శుక్రవారం మండలంలోని పుచ్చకాయలపల్లె వద్ద గ్రౌండ్ కంట్రోలు పాయింట్‌ను చెక్ చేశారు. ఆమె మాట్లాడుతూ మండలంలో రెండో విడత మాయలూరు, గోవిందపల్లె, రూపనగుడి, సుద్దమల్ల, నర్సిపల్లె గ్రామాలు రీసర్వే కు ఎంపికయ్యాయన్నారు. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రాగానే సర్వే చేపడతామని చెప్పారు. సర్వేతో రైతులకు సరిహద్దు సమస్యలు పరిష్కారమవుతాయన్నారు.